## దొడ్డి కొమురయ్య వారసులకు అవమానం

**హైదరాబాద్‌లోని కురుమ సంఘం భవన ప్రారంభానికి రాష్ట్ర సర్కారు నుంచి అందని ఆహ్వానం**


దొడ్డి భిక్షపతి


దొడ్డి చంద్రం

దేవరుప్పుల, డిసెంబర్ 15 : హైదరాబాద్‌లోని కోకాపేటలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య భవనాన్ని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన నేపథ్యంలో అమరవీరుడి వారసులకు అవమానం కలిగింది. వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్వస్థలం దేవరుప్పుల మండలం కడవెండి. వీరి వారసులు కడవెండిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కొమురయ్య అన్న కుమారుడు దొడ్డి భిక్షపతి, మనుమడు దొడ్డి చంద్రం ఆదివారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్మించిన కురమ సంఘం రాష్ట్ర భవనానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టినా కనీసం ఆయన వారసులుగా తమను ఈ ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించకపోవడం అవమానంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సాయుధ పోరులో తమ కుటుంబం నుంచి ముగ్గురుని కోల్పోయామని, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఖ్యాతి ఖండాంతరాలకు వ్యాపించిందన్నారు. రష్యాలో ఓ వీధికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టారని, ఆయన వారసులమైన తమకు ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందకపోవడంపై విచారం వ్యక్తం చేస్తున్నామని వారన్నారు. నాడు దొరల పెత్తందారీతనంతో వివక్షకు గురైన తాము నేడు పాలకుల వివక్షకు గురైనట్లు భావిస్తున్నామని తెలిపారు. దొడ్డి కొమురయ్య మరణం నుంచి ఆయన వారసులుగా తాము అనేక అవమానాలు ఎదుర్కొంటూనే ఉన్నామని ఆవేదన చెందారు.

## భూకబ్జాలకు పాల్పడితే కేసులు నమోదు చేయాలి

నర్మెట, డిసెంబర్ 15: మండలంలోని బొమ్మకూరు శివారులోని గిరిజన భూముల్లోకి అక్రమంగా ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి, గిరిజన సంఘం నాయకుడు ధరావత్ రాజు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బొమ్మకూర్, అడవికేశ్వపూర్‌కు నక్షదారి ఉందని, ఇక్కడి నుంచి అందరూ వెళ్తుంటారని చెప్పారు. కానీ అధికార పార్టీకి చెందిన కొందరి సహకారంతో మాలోత్ కిషన్ భూముల్లో రోడ్డు వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు రైతులను బెదిరిస్తున్నందున ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని వివరించారు. దీనిపై జనగామ డీసీపీ విచారణ జరిపి భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల సాయం

బచ్చన్నపేట, డిసెంబర్ 15 : మండలంలోని బండనాగారంలో ఇజ్జగిరి నర్సయ్య ఇటీవల క్రితం మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి మాజీ ఎంపీపీ బావండ్ల నాగజ్యోతికృష్ణంరాజు రూ.3 వేలు, మాజీ సర్పంచ్ శివరాత్రి కవితారాజ నర్సు, 2 వేలు, మాజీ సర్పంచ్ కొప్పురపు శ్రీలతాశ్రీనివాస్‌రెడ్డి రూ.2 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బూసరాజు రవి, నాయకులు నల్ల సత్తిరెడ్డి, శివరాత్రి బాల ఎల్లయ్య, కొప్పురపు రాజిరెడ్డి, బత్తిని రవి, రాజేంద్రప్రసాద్, లక్ష్మారెడ్డి, దశరథ, శ్రీరాములు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన పిట్టల కేశవులు తండ్రి చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ నేత, సామాజిక సేవా కార్యకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లు సిద్ధిరాములు, అభినయ్, కొమురయ్య, సిద్ధిరాములు పాల్గొన్నారు.

## ఐక్యతను చూసి తట్టుకోలేక ఆరోపణలు

ఐనవోలు, డిసెంబర్ 15 : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెటిటెడ్ అసోసియేషన్ ఐక్యతను చూసి తట్టుకొలేని కొంతమంది టెంగ్ర ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారని జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సమస్యలను ఇప్పటివరకు పరిష్కరించలేదని, అందువల్లే ట్రెంగ సంఘాన్ని స్థాపించినట్లు తెలిపారు. ట్రెంగ సంఘం ఆఫీస్ సబార్డినేట్ నుంచి సీనియర్ అసిస్టెంట్, ఎంపీఎఫ్‌వో, మండల సర్వేయర్ వరకు వారి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నదన్నారు. ట్రెంగ సంఘం ఐక్యంగా ముందుకుసాగుతుంటే కొంతమంది ఉన్నతాధికారులు కావాలనే విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారన్నారు. ట్రెంగ సభ్యులందరు అధైర్యపడొద్దని, ఎంత మంది ఎన్ని విధాలా ప్రయత్నించినా ట్రెంగ ఐక్యతను విచ్ఛినం చేయలేరన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లినర్**

SepTeK SEPTIC TANK CLEANING

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## పాలకుల్లో పెరుగుతున్న మనువాద దృక్పథం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 15 : దేశంలోని పాలకుల్లో మనువాద దృక్పథం పెరిగిందని ప్రముఖ కవి, ప్రొఫెసర్ బన్న ఐలయ్య అన్నారు. హనుమకొండ ప్రభుత్వ విద్యా కళాశాలలో బూర భిక్షపతి అధ్యక్షతన ఆచార్య వాసిరెడ్డి భాస్కర్‌రావు సాహిత్య పురస్కారం ప్రదానోత్సవం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని పునఃస్థాపన చేయడానికి కొందరు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ పాలనలో ప్రజాప్రతినిధులు అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రదర్శించే వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ప్రముఖ కవి, నవలా రచయిత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం రోజు రోజుకూ పెరుగుతోందన్నారు. భారతీయ సమాజంలో కుల నిర్మూలన సాధ్యమయ్యేది కాదని, కులానికి, మతానికి అంతర్గత సంబంధం ఉందన్నారు. సనాతన ధర్మం ముసుగులో ప్రజలను కుల పిచ్చి వైపు మళ్లించడానికి పాలకులు కార్యచరణను అమలు చేస్తున్నారని ఆరోపించారు.

# పశు వైద్యశాలల్లో డాక్టర్ల కొరత

- మూగ జీవాలకు పలు చోట్ల అటెండర్లతో చికిత్స
- పట్టించుకోని సర్కారు



మీదికొండలో మూసి ఉన్న పశువుల దవాఖాన


గొర్రెలకు చికిత్స చేస్తున్న అటెండర్

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 15 : మూగ జీవాలకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణతోపాటు ఇతర అత్యవసర వైద్య సేవలకు తగినంత మంది పశు వైద్యులు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సబ్ సెంటర్లలో అటెండర్లతో పశువులకు ఇంజక్షన్లు ఇస్తున్న దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని పశువుల దవాఖానకు వైద్యుడు ఉన్నారు. ఇక్కడ పశువులతోపాటు గొర్రెలు, మేకలకు సీజనల్‌గా వైద్య శిబిరాలు నిర్వహించి మందులు ఇస్తున్నారు. మరోవైపు ఇప్పగూడెం, మీదికొండ, చాగల్లు, తాటికొండ గ్రామాల్లో వెటర్నరీ సబ్ సెంటర్లున్నాయి. వీటిలో ఇప్పగూడెం సబ్‌సెంటర్‌కు మాత్రమే పశువైద్యాధికారి ఉన్నారు. మిగిలిన వాటికి లేకపోవడంతో మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. దీంతో పశువులు, గొర్రెలు, మేకలకు చికిత్స అందించాలంటే రైతులకు ఇబ్బందికరంగా మారింది. మరోవైపు చాగల్లు, మీదికొండలో అటెండర్లతో సబ్ సెంటర్లను నిర్వహిస్తున్నారు. అయితే వారు దవాఖానకు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు రారో తెలియని పరిస్థితి నెలకొంది. సీజన్‌వ్యాధుల నివారణలో, అత్యవసర వైద్యం అందించాలంటే రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నది.

### పశువుల దవాఖాన ఉన్నా డాక్టర్ లేరు..



మా ఇంటి ముందే పశువుల దవాఖాన ఉంది. అయినా డాక్టర్ లేడు, దీంతో నాలుగు నెలల నుంచి అటెండర్ రవీందర్ పశువులకు చికిత్స చేస్తున్నాడు. అతడికి సరైన వైద్యం రాదు. పశువును ముట్టుకోడు, పైసలు ఇస్తేనే సూదులు ఇస్తనని అంటడు. ఆసుపత్రి ముందే నా గొర్రెలుంటయి, కొద్ది రోజులుగా ఓ గొర్రె అనారోగ్యానికి గురైనా వచ్చి చూడకపోవడంతో స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్లి మందులు తీసుకొచ్చా. వచ్చిరాని వైద్యం చేసేవారితో చికిత్స చేయించొద్దు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– అంగిడి వెంకటయ్య, గొర్రెల కాపరి, చాగల్లు

### సిబ్బంది కొరతకుతోడు అదనపు పని భారం..



స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ, చాగల్లు, మీదికొండ గ్రామాల్లోని పశువుల దవాఖానలకు వైద్యులు లేరు. దీంతో అక్కడ అటెండర్లతో చికిత్స అందిస్తున్నారు. ఉన్నత చదువులు. శిక్షణ లేకపోవడండడంతో అన్ని గ్రామాలను నేనే చూసుకోవలసి వస్తుంది. దీంతో గ్రామాల్లోని గొర్రెలకాపరులు, రైతులు జీవాలకు సరైన సమయంలో చికిత్స అందించలేక పోతున్నారు. ఈ విషయమై వారం క్రితం జిల్లా అధికారి డాక్టర్ .రాధాకిషన్, జనగామ ఏడీ నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ఉప్పుగల్లు డాక్టర్ శ్రీనాథ్‌తో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి సమస్యలను వివరించారు. గొర్రెలు, మేకలకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఇచ్చాం. పశుగణనపై అన్‌లైన్ చేయడంతోపాటు వ్యాధుల నివారణకు వ్యాక్సిన్ ఇస్తున్నాం.

– డాక్టర్ మౌనిక, పశువైద్యాధికారి, ఇప్పగూడెం

## రేపు జీపీ సిబ్బంది చలో హైదరాబాద్

బచ్చన్నపేట, డిసెంబర్ 15 : గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కారోబార్లు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న చేపట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు సంఘం మండల కార్యదర్శి అన్వర్, నాయకులు ప్రభాకర్, శ్రీనివాస్, రాజు, బాబుగౌడ్, లలిత, శ్యామల ఆదివారం విలేకరులతో కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించి అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిగా పోస్టులు ఇవ్వాలని, మల్టీపర్పస్ జీవో నంబర్ 51ను ఎత్తి వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ నిర్వహించే ఆందోళనలో జీపీ ఉద్యోగులు పాల్గొనాలని, చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దయాకర్, కిష్టయ్య, గోపాల్, నర్సమ్మ, లక్ష్మి, అనిల్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన

**6వ రోజు కలెక్టరేట్ ఎదుట రోడ్లు ఊడుస్తూ నిరసన**


కలెక్టరేట్ ఎదుట రోడ్లు ఊడుస్తూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఎస్ఎస్ఏ) కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆందోళన కొనసాగుతున్నది. ఆదివారం కలెక్టరేట్ వద్ద రోడ్లను ఊడుస్తూ వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. విద్యాశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని గతేడాది ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేశ్, ప్రధాన కార్యదర్శి బైరగోని దయాకర్ గౌడ్, కోశాధికారి గోలి రవీందర్‌రెడ్డి, గోరంట్ల యాదగిరి, వీ రాజ్ కుమార్, రొయ్యల రాజు, తరేశ్, కిషన్, మధు, అన్నపూర్ణ, రాధిక, మహాలక్ష్మి, సునీత, రాణి పాల్గొన్నారు.

## రైతుభరోసా నిధులు వెంటనే విడుదల చేయాలి


పార్టీలో వారికి కండువా కప్పుతున్న రాజారెడ్డి

రఘునాథపల్లి, డిసెంబర్ 15: యాసంగి సీజన్ పంటలకు రైతుభరోసా నిధులు విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని శ్రీమన్నారాయణపురంలో సీపీఐ చేపట్టిన సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన ఇటుకల హన్మాజీ, తూడి భిక్షపతి, తూడి ఆంజనేయులు, మల్లేశ్, శ్రీనివాస్‌తో పాటు పది మంది సీపీఐలో చేరారు. రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచినా నేటికీ ఆరు గ్యారెంటీలు అమలు కాలేదని, రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ కాలేదన్నారు. జిల్లాలోని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నందున సంబంధిత అధికారులు పరిరక్షించాలని ఆయన కోరారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావటి యాదగిరి, తూడి రేణుబాబు, తూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడలు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : సీఎం కప్–2024 జిల్లా స్థాయి క్రీడా పోటీలు నేటి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి బీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక ధర్మకంచ మినీ స్టేడియంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, బేస్ బాల్ క్రీడా పోటీలు బాలబాలికలకు నిర్వహిస్తామని వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

## రేపు హనుమకొండ జిల్లాలో పాన్‌షాపుల బంద్

హనుమకొండ, డిసెంబర్ 15 : జిల్లాలో మంగళవారం పాన్‌షాపులు బంద్ చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు సంగ కుమారస్వామి యాదవ్, జిల్లా కార్యదర్శి ఎన్ సతీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే హనుమకొండ లష్కర్ బజార్‌లోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో ది హనుమకొండ పాన్ మర్చంట్స్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం ఉదయం 10గంటలకు జరుగుతుందని, జిల్లాలోని పాన్‌షాప్ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. పాన్ ధరల సవరణ, నూతన కమిటీ ఎన్నిక, సభ్యత్వ నమోదుపై చర్చిస్తామని పేర్కొన్నారు.

## యాసంగి పంటలకు గోదావరి జలాలు

లింగాలఘనపురం, డిసెంబర్ 15 : ఈ యాసంగి సీజన్‌లో మండలంలోని ఆయకట్టుకు గోదావరి జలాలు అందుతున్నాయని మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నెల్లుట్ల సమీపంలో పెండింగ్‌లో ఉన్న అశ్వరాయపల్లి కుడి కాల్వ పనులను ఆదివారం జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి నరసింహులు(శివకుమార్)తో కలిసి ఆయన ప్రాంభించారు. నెల్లుట్లకు చెందిన మాజోజు హరిప్రసాద్‌కు చెందిన కొంత భూమి అశ్వరాయపల్లి రిజర్వాయర్ కుడి కాల్వలో కోల్పోతుండగా పనులను అతడు అడ్డుకున్నాడన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం చెల్లించడంలో జాప్యం జరుగుతుండడంతో సదరు రైతు హరిప్రసాద్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఒప్పించి సొంతంగా రూ.50 వేలు, తాను రూ.50 వేలతో మొత్తం రూ.లక్ష అందించామన్నారు. దీంతో కాల్వ నిర్మాణ పనులకు అడ్డంకులు తొలగిపోయాయన్నారు. ఈ కాల్వ ద్వారా నెల్లుట్ల, నాగారం, లింగాలఘనపురం, పటేలుగూడెం, నవాబుపేట, గుమ్మడవెల్లి, బండ్లగూడెం, జీడికల్, సిరిపురం గ్రామాల రైతులకు సాగునీరుగా అందుతుందన్నారు. నాయకులు కొల్లూరి నరసింహులు(శివకుమార్),కీసర దిలీప్‌రెడ్డి, బొల్లంపెల్లి నాగేందర్, ఏలె మూర్తి, బిట్లబాబు, ప్రవీణ్, నీలం మోహన్, మల్ల శ్రీశైలం, నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.

## రేపు గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా స్థాయి సమావేశం


గౌడజన హక్కుల పోరాట సమితి మండల కార్యవర్గం

కొడకండ్ల, డిసెంబర్ 15 : మండల కేంద్రంలోని గౌడ సొసైటీ హాల్‌లో ఈ నెల 17న జరిగే గౌడజన హక్కుల పోరాట సమితి జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్మెట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న చౌరస్తాలో గౌడజన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట సమితి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా దండంపెల్లి సోమయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎరుకల సైదులు గౌడ్, ఉపాధ్యక్షుడిగా నూనెముంతల ఎల్లాగౌడ్, బాల్నే మహేందర్‌గౌడ్, కోశాధికారిగా నిమ్మల మహేష్ గౌడ్, అధికార ప్రతినిధిగా నలమాస యాకన్న గౌడ్, సహాయ కార్యదర్శిగా ముత్యం మధుగౌడ్, మండల యూత్ అధ్యక్షుడిగా కోల నరేశ్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో బాల్నె వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

## మృతుడి కుటుంబానికి పరామర్శ

చిల్పూరు, డిసెంబర్ 15 : మండలంలోని కొండాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ లోడెం రజితారవీందర్ తండ్రి కొండ ఓనయ్య (62) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మృతదేహానికి స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటికొండ రాజయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ అధ్యక్షుడు గాలి ప్రవీణ్ పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు ముందుకు రాని బంధువులు

**జనగామలో గుండెపోటుతో వ్యక్తి మృతి**
**స్థానికులే అంత్యక్రియలు నిర్వహించిన వైనం**



మృతదేహంతో అంతిమయాత్ర నిర్వహిస్తున్న స్థానికులు(ఇన్‌సెట్‌లో) శ్రీకాంత్ (ఫైల్)

జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : జిల్లా కేంద్రంలో అమానవీయ సంఘటన చోటు చేసుకుంది. జనగామ పట్టణంలోని మూలబావి ఏరియాకు చెందిన కాట శ్రీకాంత్ (32) శనివారం అర్ధరాత్రి నిద్రలోనే గుండెపోటుకు గురై మృతి చెందగా, అంత్యక్రియలకు బంధువులు ముందుకు రాకపోవడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాంత్‌కు మృతుడికి భార్యతో పాటు పన్నెండేళ్ల కుమారుడు ఉన్నారు. భార్యభర్తల మధ్య విభేదాలు తలెత్తడం తో ఏడాది క్రితం భార్య కుమారుడితో కలిసి పుట్టింటికి వెళ్లింది. శ్రీకాంత్ స్థానిక మూలబావి ఏరియాలో అద్దె ఇంట్లో ఒంటరిగా నివాసముంటున్నాడు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీకాంత్ ఇంటి తలుపులు తీయకుండా ఉండడంతో అనుమానం వచ్చిన పక్కింటి వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే శ్రీకాంత్ నిద్రలోనే మృతి చెందాడు. ఈ మరణ వార్తను మృతుడి భార్య, కుమారుడితో పాటు అత్తమామలకు, అమ్మమ్మ, మేనమామలకు స్థానికులు సమాచారం అందించారు. శ్రీకాంత్ కన్నతల్లి చిన్నప్పుడే చనిపోగా, కొన్నేండ్ల క్రితం తండ్రి కూడా చనిపోయాడని, తోబుట్టువు ఉంటే ఆమె కూడా భర్త చేతిలో మృత్యువాత పడిందని చుట్టుపక్కల వారు తెలిపారు. ఈ క్రమంలో శ్రీకాంత్ మరణ వార్త తెలుసుకున్న భార్య, కుమారుడితో పాటు అత్తమామలు, మేనమామ, అమ్మమ్మ కేవలం చుట్టపు చూపుగా వచ్చి చూసి వెళ్లారు. మృతుడి అంత్యక్రియలు నిర్వహించడానికి మేము సిద్ధంగా లేమంటూ సంబంధిత 1వ వార్డు కౌన్సిలర్ రామగళ్ల అరుణ విజయ్ కుమార్‌కు భార్య, అత్తమామలు పేపర్ రాసిచ్చి వెళ్లినట్లు తెలిసింది. అదేవిధంగా అమ్మమ్మ, మేనమామ కూడా తమకు సంబంధం లేదని వెళ్లడంతో అనాథగా మారిన శ్రీకాంత్ మృతదేహాన్ని ఆదివారం రాత్రి వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో స్థానికులు గజ్జెల మోహన్‌రెడ్డి, ఉల్లెంగుల సాయిలు, బెజ్జం మహేశ్, వెంకన్న, సందీప్, దామోదర్, రాజు శానిటేషన్ లేబర్ జాలిగం శ్రీనివాస్, శ్రీకాంత్, చింతల మహేశ్ 'ఆ నలుగురు'గా మారి ఆఖరి మజిలీ పూర్తి చేశారు.


జనగామలోని ఏబీవీ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

## ప్రశాంతంగా గ్రూప్-2 ప్రవేశ పరీక్ష

**తొలిరోజు ఉదయం పరీక్షకు 2511 మంది, మధ్యాహ్నం 2523 మంది అభ్యర్థుల గైర్హాజర్**

జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 ప్రవేశ పరీక్ష జిల్లాలో తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్), మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 (హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ) పరీక్ష జరిగింది. జిల్లా కేంద్రంలో (యశ్వంతాపూర్‌తో సహా) ఏర్పాటు చేసిన 16 పరీక్ష కేంద్రాల్లో పురుష అభ్యర్థులు 3094, మహిళలు 2376 మంది కలిపి మొత్తంగా 5470 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఉదయం జరిగిన పరీక్షకు 2959 మంది, మధ్యాహ్నం పరీక్షకు 2947 మంది హాజరయ్యారు. అదేవిధంగా ఉదయం పరీక్షకు 2511 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం పరీక్షకు 2523 మంది భారీ స్థాయిలో గైర్హాజర్ అయ్యారు. పరీక్ష సమయానికన్నా అరగంట ముందే పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించారు. క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల, ఏకశిల డిగ్రీ కళాశాలతో పాటు పలు కేంద్రాల్లోకి చివరి నిమిషంలో అభ్యర్థులు రావడంతో అధికారులు అనుమతించలేదు. దీంతో కొందరు అభ్యర్థులు ఆవేదనతో పరీక్ష కేంద్రాల నుంచి వెనుదిరిగారు. యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద వెస్ట్‌జోన్ డీసీపీ రాజ మహేంద్ర నాయక్ బందోబస్తును పరిశీలించారు.

## నేడు కలెక్టరేట్‌లో 'ప్రజావాణి' రద్దు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 15 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నేడు రద్దు చేసినట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా అధికారులు గ్రూప్–2 ప్రవేశ పరీక్ష విధుల్లో ఉన్న కారణంగా ప్రజలకు అందుబాటులో ఉండరని పేర్కొన్నారు. ప్రజలు ఎవరూ కలెక్టరేట్‌కు రావొద్దని ఆయన సూచించారు.

## 16 రోజులు దాటినా బోనస్ డబ్బులు రాలె..

**అయ్యంగారిపల్లి రైతు కడుదూరి సంపత్ ఆవేదన**




పాలకుర్తి, డిసెంబర్ 15: సన్న ధాన్యం విక్రయించి రెండు వారాలు దాటినా బోనస్ డబ్బులు రైతుల బ్యాంకు అకౌంట్‌లో జమకాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న వైనమిది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని అయ్యంగారిపల్లికి చెందిన రైతు కడుదూరి సంపత్ గత నెల 30వ తేదీన ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో 27 క్వింటాళ్ల 80 కిలోల ధాన్యాన్ని విక్రయించాడు. సంపత్‌కు ధాన్యం డబ్బులు రూ.64,154 తన అకౌంట్‌లో జామయ్యాయి. అయితే సన్న ధాన్యానికి సంబంధించిన బోనస్ డబ్బులు జమ కాలేదని రైతు సంపత్ ఆదివారం 'నమస్తే తెలంగాణ'తో తెలిపారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి మాత్రం రైతులు ధాన్యం అమ్మిన వెంటనే బోనస్ డబ్బులు రైతుల బ్యాంకు అకౌంట్‌లో జమవుతాయని చెప్పారని వివరించాడు. ధాన్యం విక్రయించి 16 రోజులైనా ఎందుకు బోనస్ డబ్బులు రాలేదని సంపత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాడు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే మూడు లారీల వడ్లకు బోనస్ డబ్బులు పడలేదని చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి తక్షణమే రైతుల సమస్యలను గమనించి బోనస్ డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.


జఫర్‌గఢ్ స్కూల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జఫర్‌గఢ్, డిసెంబర్ 15 : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పూర్వ విద్యారులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2007 – 2008 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు బోధించిన పూర్వ ఉపాధ్యాయులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల గదులను పరిశీలించి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఇంద్రారెడ్డి, వెంకటాచారి, మధుసూదన్, జెన్నయ్య, పద్మలత, నజీమా, షర్మిల, పాషా, శ్రీలత పాల్గొన్నారు.


కొడకండ్ల యూనిట్ నూతన కార్యవర్గం

## నాలుగో తరగతి ఉద్యోగుల కొడకండ్ల యూనిట్ కార్యవర్గం ఎన్నిక

కొడకండ్ల, డిసెంబర్ 15 : నాలుగో తరగతి ఉద్యోగుల కొడకండ్ల యూనిట్ పరిధిలోని కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల మండలాల ఉద్యోగులు ఆదివారం మండల కేంద్రంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా సీహెచ్ నవీన్, అసోసియెట్ అధ్యక్షులుగా బీ యాదయ్య, ఉపాధ్యక్షులుగా బీ వెంకటయ్య, ఈ సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా సీతారామాంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా జే మమత, కోశాధికారిగా వీ యాకయ్య, కో ఆప్షన్ సభ్యులు ఎం సత్తయ్య, ఎన్ అమరేందర్, ప్రచార కార్యదర్శి ఎన్ వినోద, కార్యాలయ కార్యదర్శిగా ఎండీ అఫ్జల్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సత్తయ్య, వెంకటేశర్లు, సీహెచ్ నర్సింగరావు, సత్తయ్య వ్యవహరించారు.

## అద్దె బస్సుల్లో నుంచి డీజిల్ మాయం

పరకాల, డిసెంబర్ 15 : సర్వీసింగ్ సెంటర్‌లో ఉన్న ఆర్టీసీ అద్దె బస్సుల్లో నుంచి డీజిల్ మాయమైన ఘటన పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సర్వీసింగ్ సెంటర్ నిర్వాహకుడు రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హనుమకొండ రోడ్డులోని శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి సర్వీసింగ్ సెంటర్‌లో ఆర్టీసీ అద్దె బస్సులు రిపేరింగ్ చేస్తారు. ఈ క్రమంలో 14వ తేదీన తెల్లవారు జామున సర్వీసింగ్ సెంటర్‌లో ఉన్న బస్సులో నుంచి 150లీటర్ల డీజిల్, మరో బస్సులో నుంచి 200లీటర్ల డీజిల్ గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. కాగా, ఈ ఘటపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాజేందర్ పేర్కొన్నారు.